



స్పీకర్ యూటీ ఖాదర్ చాంబర్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు

చాంబర్‌లోనే ఘెరావ్

- స్పీకర్‌ను అడ్డుకున్న బీజేపీ ఎమ్మెల్యేలు
- సభలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శాసనసభలో పార్టీలక తీతంగా వ్యవహరించాల్సిన స్పీకర్ యూటీ ఖాదర్ ఏకపక్షంగా సభను నడిపిస్తున్నారంటూ బీజేపీ సభ్యులు ఆయన్ని ఘెరావ్ చేశారు. పంచమశాలీల రిజర్వేషన్ వివాదంపై సభలో గందరగోళం చోటు చేసుకోవడంతో కలాపాలను వాయిదా వేసిన స్పీకర్ నేరుగా చాంబర్‌కు వెళ్ళారు. బీజేపీ, జేడీఎస్ పార్టీకు చెందిన ఎమ్మెల్యేలు కూడా చాంబర్‌కు వెళ్ళి స్పీకర్ యూటీ ఖాదర్‌ను ఘెరావ్ చేశారు. ఒక్కసారిగా ఏం జరిగిందనేది తెలుసుకునేందుకు మార్షల్స్ తీవ్ర కసరత్తు చేయాల్సి వచ్చింది. సాధారణంగా సభలో వాగ్వాదాలు జరుగుతాయి. అయితే చాంబర్‌లో స్పీకర్‌ను అడ్డుకోవడం కలకలం రేపింది. సాధారణంగా స్పీకర్ చాంబర్‌లో సభ్యులు చర్చలు జరిపేందుకు లేదా బిజినెస్ అడ్వయజరీ కమిటీ భేటీకి వెళ్తుంటారు. ఛాంబర్‌లో గందరగోళం చోటుచేసుకోగా వాగ్వాదం జరిగింది. గొడవ బయటకు తెలియకుండానే మార్షల్స్ తలుపులు వేశారు. జీరోఅవర్‌లో రిజర్వేషన్‌కు సంబంధించి చర్చకు బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. అధికార కాంగ్రెస్ సభ్యుడు విజయానంద కొశ్శన్ అవర్

అవర్ నోటీసు ఇచ్చారు. ఇదే సమయంలోనే హోంమంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ పంచమశాలీల నిరసన వేళ పోలీసులు చట్టపరిధిలోనే వ్యవహరించారని, తప్పనిసరి పరిస్థితిలోనే లాఠీ చార్జ్ చేశారన్నారు. అందుకు ప్రతిపక్షనేత అశోక్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. శాంతియుతంగా నిరసన సాగించేవారిపై లాఠీచార్జి సమంజసమనేలా మాట్లాడటం సరికాదన్నారు. అంతలోనే బీజేపీ సభ్యుడు సునిల్‌కుమార్ మాట్లాడుతూ అభ్యంతరం తెలిపారు. రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ వివరణ ఇచ్చేందుకు స్పీకర్ అనుమతివ్వడాన్ని బీజేపీ సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. ఒకే అంశంపై ఇద్దరు మంత్రులు ఎలా మాట్లాడతారన్నారు. అంతలోనే కాంగ్రెస్ సభ్యుడు మాట్లాడే అవకాశం ఇవ్వగా పంచమశాలీ లింగాయతుల నిరసనలో విధ్వంసం వెనుక ఆర్‌ఎస్‌ఎస్ ఉందంటూ ఆరోపించడంతో బీజేపీ సభ్యులు విరుచుకుపడ్డారు. దీంతో సభలో గందరగోళ వాతావరణం చోటుచేసుకోగా కలాపాలను స్పీకర్ కాసేపు వాయిదా వేశారు. అదే అవేశంలోనే స్పీకర్‌ను చాంబర్‌లోనే సభ్యు లు ఘెరావ్ చేశారు.



సమావేశమైన సభ్యులు



రాయచూరులో రహదారి దుస్థితి (ఫైల్)



అభివృద్ధికి... దూరం..!

- పేరు మారినా ప్రగతి శూన్యం
- కల్యాణ కర్ణాటకలో రాజ్యమేలుతున్న నిరుద్యోగం
- అమలుగాని ఆర్టికల్ 371 జే

పరిశ్రమల స్థాపనలో వెనకడుగు

కల్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే భారీ పరిశ్రమలు ఏర్పాటు కావాలని, అప్పుడే ఉద్యోగ, ఉపాధి మెరుగవుతుందని ఐదు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ ఉంది. మరోవైపు విద్యాసంస్థల మెరుగును ఈ ప్రాంత ప్రజలు ప్రధానంగా కోరుతున్నారు. 15వ ఆర్థిక కమిషన్ ఛైర్మన్ ఎన్‌కే సింగ్ అభిప్రాయం ప్రకారం కూడా కర్ణాటకలో అభివృద్ధి చెందిన ప్రాంతాలు, వెనుకబడిన ప్రాంతాలు అనే వ్యత్యాసాన్ని సమతుల్యం చేయాల్సిన అవసరం ఉంది.

జిల్లాలవారీగా ప్రధాన డిమాండ్లు

కొప్పళ జిల్లాకు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, తుంగభద్ర జలాశయం మనుగడకోసం ప్రత్యామ్నాయంగా నవళి జలాశయం నిర్మాణం, కొప్పళలో ఎయిర్‌పోర్ట్ చేయడం ప్రధానమైనవిగా ఉన్నాయి. రాయచూరులో యూనివర్సిటీ, ఒపెక్స్ ఆసుపత్రి ఉన్నతీకరణ, చిన్నపిల్లల ఆసుపత్రి నిర్మాణం, తుంగభద్ర ఎడమకాలువ ఆధునీకరణ చేయడం, విజయనగర జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, పర్యాటక అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలు పెంచడం, హంపి కన్నడ విశ్వవిద్యాలయానికి గ్రాంట్లు పెంచడం వంటివి డిమాండ్ కాగా బళ్ళారిలో ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి చేయడం, స్టీల్‌హబ్‌గా తీర్చిదిద్దడం, వరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు ఉన్నాయి.

ఖాళీలను భర్తీ చేయాలి

కల్యాణ కర్ణాటక జిల్లాల్లో ఖాళీగా ఉండే 17వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రత్యేక సచివాలయం ఏర్పాటు, ప్రత్యేక పారిశ్రామిక పాలసీ, కలబురగిలో డిమాండ్ ఉండే బైపాస్‌రోడ్డు ఏర్పాటు, కంది బోర్డుకు గ్రాంట్లు పెంచి కంది రైతులను ప్రోత్సహించడం, 371జే ఆర్టికల్ కింద విద్య, ఉద్యోగం, పదోన్నతులలో అన్యాయాన్ని సరిచేయడం, ఇక్కడ ఖాళీగా ఉండే 19వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, యాదగిరిలో పరిశ్రమల ఏర్పాటు, బీదర్‌లో జిల్లా కార్యాలయాల క్లస్టర్ భవనం ఏర్పాటు వంటివి డిమాండ్‌గా ఉన్నాయి. కల్యాణ-కర్ణాటక జిల్లాల్లో చారిత్రాత్మక కేంద్రాల అభివృద్ధి ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే డిమాండ్ ఉంది. వివిధ జిల్లాల్లో అభివృద్ధితో సమగ్ర ప్రగతి దిశ ఎప్పుడవుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దక్షిణభారత దేశంలోనే కాకుండా దేశవ్యాప్తంగా అభివృద్ధిలో పరుగులు తీస్తున్న రాష్ట్రంగా కర్ణాటకకు గుర్తింపు ఉంది. రాజధాని బెంగళూరు ప్రపంచనగరాల్లో ప్రముఖమైనదిగా పేరొందగా ఇక్కడ ఐటీ, బీటీ, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలలో విశ్వవ్యాప్తంగా పేరొందిన కంపెనీలకు నెలవైంది. దేశ స్టార్టప్ రాజధానిగా బెంగళూరుకు పేరుంది. దేశంలో అత్యధిక పన్నులు చెల్లించే, అత్యధిక పెట్టుబడులు సాధించే రాష్ట్రాల్లో రెండోస్థానంలో కొనసాగుతోంది. ఇలా రాష్ట్రం ఎన్నో రంగాలలో ముందంజలో కొనసాగుతోంది. ఇదంతా బెంగళూరుకే పరిమితంగా మారిపోతోంది. రాష్ట్రంలో దశాబ్దాలకాలంగా వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ - కర్ణాటకను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తుంది గానీ ఆచరణలో మాత్రం లేదనే భయంకర నిజం అక్కడి ప్రజల జీవన విధానాలకు అద్దం పడుతోంది. హైదరాబాద్-కర్ణాటకగా కొనసాగే ప్రాంతానికి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు వెళ్లరని, పైగా స్థానికులు ఇతర జిల్లాల వారితో పోటీ పడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించలేరని, ఇతరత్రా పథకాల ద్వారా కూడా అభివృద్ధి పొందలేకపోతున్నారని యూపీఏ2 పాలనలో 371జే ఆర్టికల్‌ను తీసుకొచ్చారు. 98వ రాజ్యాంగ సవరణ ద్వారా 2012లో ఆర్టికల్ మనుగడలోకి వచ్చింది. దీన్ని బట్టి హైదరాబాద్-కర్ణాటకకు అనుబంధమైన బీదర్, కలబురగి, యాదగిరి, రాయచూరు. కొప్పళ, బళ్ళారి, విజయనగర జిల్లాల పరిధిలో ఉద్యోగాలు స్థానికులకే కేటాయించడంతోపాటు ఇతర ప్రాంతాలతో సంబంధం లేకుండా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేలా ఆర్టికల్ సూచిస్తుంది. రాష్ట్రాల విభజనకు ముందు ఈ ప్రాంతం హైదరాబాద్‌కు అనుబంధంగా ఉండేది. దీంతో హైదరాబాద్-కర్ణాటకగానే పిలిచేవారు. హైదరాబాద్ అనే పదాన్ని తొలగించేలా 2019లో ఈ ప్రాంతాన్ని 'కల్యాణ కర్ణాటక'గా ప్రకటించారు. పేరు మారిందిగానీ ప్రగతిమాత్రం ముందుకు సాగలేదు. ఇటు రాష్ట్ర, అటు కేంద్రప్రభుత్వాలు రాష్ట్రంలో జరిపే ఆరోగ్య, తలసరి ఆదాయం, మానవ అభివృద్ధి సూచికతోపాటు సమీక్ష ఏదైనా కల్యాణ-కర్ణాటక జిల్లాలు చివరిస్థానంలోనే ఉన్నాయి. 371జే రాజ్యాంగ సవరణ జరిగి 12ఏళ్ల పూర్తి అవుతోంది. అయినా ప్రజల జీవన విధానంలో ఎటువంటి మార్పు లేకపోవడం, ప్రగతిపరమైన రాష్ట్రానికి సిగ్గుచేటుగా మారింది. ముంబై కర్ణాటకగా ఉండే ఉత్తర కన్నడ, బెళగావి, ధారవాడ, విజయపుర, బాగల్కోటె, గదగ్, హావేరి జిల్లాలను 2021లో 'కిత్తూరు - కర్ణాటక'గా మార్పు చేశారు. ఈ రెండు ప్రాంతాలను కలిపి ఉత్తర కర్ణాటకగా పిలుస్తారు. ఉత్తర కర్ణాటక వెనుకబడిన ప్రాంతంగా ఉండడంతో తరచూ ప్రత్యేక రాష్ట్రం నినాదం తెరపైకి వస్తుండేది. 'సమైఖ్య కర్ణాటక' ఎప్పటికి విడిపోరాదని భావించిన పాలకులు బెళగావి కేంద్రంగా సువర్ణసౌధను నిర్మించారు. ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు నిర్వహించడం ద్వారా ఈ ప్రాంతానికి పాలకులు, అధికారులు వస్తారని ప్రత్యేకించి ఉత్తర కర్ణాటక సమస్యలపై శాసనసభలో చర్చించడం ద్వారా పరిష్కారంతోపాటు చట్టబద్ధత సాధ్యమవుతుందని ఈ ప్రాంత ప్రజలు సంబరపడ్డారు. దశాబ్దాలు గడుస్తున్నాయిగానీ అభివృద్ధి పరంగా ఆశించినంత మేర సాధ్యం కాలేదని పలు సర్వేలు సూచిస్తున్నాయి. కల్యాణ కర్ణాటకకోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. రాజకీయంగా అనుభవం కలిగిన సీనియర్ ఎమ్మెల్యే అజయ్‌సింగ్‌ను కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించారు. కలబురగిలో సుదీర్ఘకాలం తర్వాత మంత్రివర్గ సమావేశం నిర్వహించడం ద్వారా సీఎం సిద్దరామయ్య కొత్త అధ్యయనానికి శ్రీకారం చుట్టారు.



బాలింతను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ నాగలక్ష్మి

బాలింతల కుటుంబాలకు పరిహారం పెంచాలి

- మృతిపై దర్యాప్తు చేపట్టాలి
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి

- 8లో



ఎస్‌ఎం కృష్ణ సంపూర్ణ జీవితం గడిపారు

- మృతిపై బాధలేదు..
- మాది తండ్రీకొడుకుల వంటి అనుబంధం: డీసీఎం డీకే

7



వర్షంలో వాహనదారుల ఇబ్బందులు

రాష్ట్రంలో తుఫాన్ ఎఫెక్ట్

- పలు జిల్లాల్లో చిరుజల్లులు
- నగరంలో రోజంతా వానతో ఇబ్బందులు

7

మాజీ మంత్రిని అడ్డుకున్న శివసేన కార్యకర్తలు

- కొల్హాపుర దర్శనానికి వెళ్తుండగా నిరసన
- ఓటమితోనే వివాదం సృష్టిస్తున్నారని ప్రభు చౌహాన్ ఆగ్రహం

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బెళగావి ప్రాంతానికి మహారాష్ట్రలో విలీనం చేయాలనే డిమాండ్ చేసిన శివసేన ఉద్ధవ్‌ఠాక్రే వర్గీయులు రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి ప్రభు చౌహాన్‌ను కొల్హాపుర లక్ష్మీదేవి ఆలయంలోకి వెళ్ళకుండా అడ్డుకున్నారు. రాష్ట్రంలోని ఉత్తరకర్ణాటక జిల్లాల వాసులు నిరంతరం కొల్హాపుర లక్ష్మీదేవి ఆలయానికి వెళ్ళడం ఆచారంగా భావిస్తారు. బీదర్‌కు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ బుధవారం కొల్హాపుర ఆలయానికి వెళ్ళారు. ఆయనను గుర్తించిన స్థానిక శివసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. కర్ణాటక ప్రభుత్వంతో పాటు కన్నడ సంఘాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శివసేన కొల్హాపుర జిల్లాధ్యక్షుడు విజయదేవానె, సంజయ్‌పవార, సునిల్‌మోదీ నేతృత్వంలో పలువురు కార్యకర్తలు ఆలయం వద్ద వీరంగం చేశారు. బెళగావి, బీదర్, భాల్కి, కారవార, నిప్పాణి ప్రాంతాలను మహారాష్ట్రలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కర్ణాటకలో మరాఠీలపై దౌర్జన్యాలు పెరుగుతున్నాయని మండిపడ్డారు. కాగా బెళగావిలో ఈనెల 9నుంచి శాసనసభ శీతాకాల సమావేశాలు ఆరంభమయ్యాయి. ఇదే రోజున బెళగావిలో మహారాష్ట్ర ఏకీకరణ సమితి (ఎంఈఎస్) మహాగావ్ పేరిట సభ జరిపేందుకు అనుమతులు కోరగా జిల్లా యంత్రాంగం అంగీకరించలేదు. ఇదే విషయాన్ని ప్రస్తావించిన శివసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరాఠాల సమస్యలు తెలుసుకునేందుకు బెళగావికి వెళ్ళేందుకు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇదే విషయమై బెళగావి సువర్ణసౌధ ప్రాంగణంలో గురువారం ప్రభుచౌహాన్ మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రలో ఇటీవల జరిగిన ఎన్నికలలో శివసేన వర్గం ఘోరంగా ఓడిందని అందుకే ఇటువంటి వివాదాలను తెరపైకి తీసుకువస్తున్నారని మండిపడ్డారు.



కొల్హాపురలో మాజీ మంత్రి ప్రభు చౌహాన్‌ను అడ్డుకున్న శివసేన కార్యకర్తలు



యువతి రూపంలో తయారైన కేక్

సో(కే)కులు చూద్దాం రారండి..

- నగరంలో నేటి నుంచి కేక్ షో
- స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రత్యేక రూపాల్లో..

-7లో

అట్టుడికిన అసెంబ్లీ..!

- పంచమశాలీల నిరసనలో లాఠీచార్జ్‌పై బీజేపీ సభ్యుల ఆగ్రహం
- సీఎంతో వాగ్వాదం



పరిషత్‌లో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంచమశాలి లింగాయతుల నిరసనలో పోలీసుల లాఠీచార్జ్‌పై అసెంబ్లీ అట్టుడికింది. గురువారం కలాపాలు ప్రారంభం కాగానే ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు లాఠీచార్జ్ అంశంపై చర్చకు అవకాశం ఇవ్వాలని ప్రతిపక్షనేత అశోక్, సీనియర్ సభ్యులు అశ్వత్థనారాయణ, ఆరగ జ్ఞానేంద్ర, సునిల్‌కుమార్ తదితరులు విషయాన్ని ప్రస్తావించారు. స్పీకర్ యూటీ ఖాదర్ మాత్రం ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మృతికి సంబంధించి సంతాపం తెలపాల్సి ఉందన్నారు. ఇదే సందర్భంలో శాసనసభలో ఎమ్మెల్యేలుగా కొనసాగినవారు మృతి చెందారని వారి కుటుంబం దుఃఖాన్ని తగ్గించేలా శాసనసభలో చర్చించాల్సి ఉందన్నారు. మీ ఉత్సాహం నాకు అర్థమవుతోందని స్పీకర్ ప్రస్తావించారు. సునిల్‌కుమార్ మాట్లాడుతూ ఇది ఉత్సాహం కలిగించే అంశం కాదని, బాధ కలిగించే విషయమని, శాంతియుతంగా పోరాటం చేసేవారిని చితకబాదారని ఇదెక్కడి విపర్యాసమని మండిపడ్డారు. అంతలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యే నరేంద్రస్వామి, ఆ నొప్పికి బీజేపీయే కారణమన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్పీకర్ సభ్యులను నచ్చచెప్పి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం ప్రతిపక్షనేత లాఠీచార్జ్ అంశాన్ని ప్రస్తావించారు. సీఎం సిద్దరామయ్యతోపాటు అధికారపార్టీ పంచమసాలిలపట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించిందని విరుచుకుపడ్డారు. అధికార పార్టీ సభ్యులు రిజర్వేషన్లన్నంటిపైనా చర్చ జరగాలని, పంచమసాలిలకు రిజర్వేషన్‌లకు బీజేపీ కారణమన్నారు. ఇలా వాగ్వాదం చోటు చేసుకుంది. ఇంతలోనే సీఎం సిద్దరామయ్య మాట్లాడుతూ పంచమశాలిల రిజర్వేషన్లకు సంబంధించి జయమృత్యుంజయస్వామిజీతో చర్చలు జరిపామన్నారు. నిరసన జరిపే అవకాశం ఉందన్నారు. కానీ 2ఏ రిజర్వేషన్ డిమాండ్ రాజ్యాంగానికి వ్యతిరేకమన్నారు. అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తీవ్రం కావడంతో సీఎం శాసనసభ నుంచి బయటకు వచ్చారు. అనంతరం ఆయన విధానపరిషత్‌కు వెళ్లారు. ఇదే సందర్భంలోనే హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ లాఠీచార్జ్ నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని, శాంతియుతంగా వారు ధర్నా చేసేందుకు వీలుందని కానీ వారు హింసకు కారకులు కావడంతోనే లాఠీచార్జ్ అనివార్యమైందన్నారు. అనంతరం శాసనసభలో తీవ్రమైన వాగ్వాదానికి కారణమైంది. దీంతో సభను వాయిదా వేశారు. స్పీకర్‌చాంబర్‌లోకి వెళ్లగా అక్కడా బీజేపీ నిరసన చేపట్టింది.

మరోవైపు సీఎం సిద్దరామయ్య పరిషత్‌లో మాట్లాడుతూ రిజర్వేషన్ అంశం ఆర్టికల్ 340 ప్రకారమే చేపట్టాల్సి ఉంటుందన్నారు. వారికి నిరసన తెలిపే హక్కు ఉందన్నారు. 2ఏ రిజర్వేషన్‌లో చేర్చాల్సి ఉంటే శాశ్వత బీసీ కమిషన్ సిఫారసు చేయాల్సి ఉంటుందన్నారు. ఎవరిని బీసీలోకి చేర్చాలన్నా కమిషన్ ముందు చర్చ జరగాల్సి ఉంటుందన్నారు. అయితే సీఎం వ్యాఖ్యలకు ప్రతిపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పరిషత్‌లోనూ గందరగోళ పరిస్థితి కొనసాగింది. కాగా గురువారం ఉత్తరకర్ణాటక జిల్లాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ పంచమశాలిలు నిరసన చేపట్టారు. పంచమశాలిలపై లాఠీచార్జ్‌ను ఖండిస్తూ మండిపడ్డారు. బెళగావి జిల్లా హిరేబాగేవాడిలో నిరసనలో జయమృత్యుంజయ స్వామిజీ పాల్గొన్నారు. లింగాయతుల పట్ల సీఎం సిద్దరామయ్య నిర్లక్ష్యం చూపారన్నారు. అధికారంలోకి వచ్చేందుకు మేమే కారణమని అందుకు ప్రతిగా మాపైనే దాడి చేశారని, వచ్చే ఎన్నికల్లో ఈ పరిణామం చూపుతామన్నారు. లాఠీచార్జ్ జరిగినప్పుడు ఆ సామాజికవర్గానికిచెందిన ఓ ఎమ్మెల్యే సీఎం వద్దకు వెళ్లి లాఠీచార్జ్ జరుగుతోందని ఆపాలని కోరారన్నారు. అందుకు సీఎం మాత్రం లాఠీచార్జ్ కొనసాగని, మమ్మల్ని వ్యతిరేకిస్తారా అంటూ తమ వద్ద లాఠీలు ఉన్నాయంటూ వ్యాఖ్యానించారన్నారు. సదరు ఎమ్మెల్యే పేరును బహిష్కరించలేమన్నారు. బసవణ్ణను సాంస్కృతిక రాయబారిగా వ్యవహరించినప్పుడు తామంతా ఆశీర్వదించామన్నారు. అయితే లింగాయతల పట్ల మీ ప్రేమ ఏమిటోఅర్థమవుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ వర్గానికి సానుకూలం చేసేవారికి మద్దతు ఇస్తామన్నారు. ఈ ప్రభుత్వంలో రిజర్వేషన్ సాధ్యంకాని పక్షంలో ఆ విషయం స్పష్టం చేయాలన్నారు. లాఠీచార్జ్ విషయమై బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, అప్పటివరకు పోరాటం చేస్తామన్నారు. మఫ్టీ పోలీసులే రాళ్లు రువ్వారని మండిపడ్డారు. కాగా సువర్ణసౌధ ప్రాంగణంలో లాఠీచార్జ్‌ను నిరసిస్తూ ప్రతిపక్ష నేత అశోక్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ గైర్హాజరయ్యారు.



లాఠీచార్జ్‌ను ఖండిస్తూ విధానసౌధ వద్ద బీజేపీ ఎమ్మెల్యేల నిరసన



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హనుమద్దీక్షల్లో భాగంగా చివరి రోజు గురువారం ఉదయం హనుమద్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. హనుమాన్ మాలా ధారులు ఇరుముడులతో గుంతకల్లులోని బళ్లారి బైపాస్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి దేవాలయం వద్దకు చేరుకున్నారు. స్వామివారిని అలంకరించి తేరుపై ఆశీనులను చేసి, ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. హనుమాన్ భక్తులతో కలసి టీడీపీ నాయకులు కసాపురం ఆలయం వరకూ ఏడు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. యువతుల సాంస్కృతిక ప్రదర్శనలు, కేరళ కళాకారుల మృదంగ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నెట్టికంటి ఆలయానికి చేరుకున్న హనుమాన్ భక్తులు ఇరుముడులను సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో గురువారం రాత్రి నిద్రచేశారు. కార్యక్రమంలో కసాపురం దేవస్థాన ఈఓ వాణి, ధర్మకర్త సుగుణమ్మ, టీడీపీ నాయకులు శ్రీనాథ్‌గౌడు, గుమ్మనూరు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారంలో నెట్టికంటి ఉత్సవ విగ్రహం.. భక్తుల కోలాటం





సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్ఓ

వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణపై స్థానిక పంపనూరు నగరవనంలోని అతిథి గృహంలో అనంతపురం డివిజన్ అటవీశాఖ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వుకు సంబంధించిన సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఎన్ఎస్‌టీఆర్ - ఏసీఎఫ్ ధనరాజ్ సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ అప్పా పెట్రోలింగ్ యాప్, కెమెరా ట్రాప్ ఆపరేషన్ ద్వారా అడవిలో వన్యప్రాణుల గుర్తింపు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్స్ అక్బర్, నారపరెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన బాలికల జట్టు



చక్రిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఆంధ్రా-15 బాలికల జట్టు సెమీస్‌కు చేరింది. బీసీసీఐ ఆధ్వర్యంలో జైపూర్‌లో జరుగుతున్న పోటీల్లో గుజరాత్‌తో ఆంధ్రా-15 బాలికల జట్టు తలపడింది. ఆంధ్రా మొదట బ్యాటింగ్ చేసి 35ఓవర్లలో ఆరు వికెట్లకు 187పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన గుజరాత్ 31.5ఓవర్లలో 164పరుగులకు ఆలౌట్ అయి ఓటమిపాలైంది. ఇందులో ఆంధ్రా జట్టులోని జిల్లా క్రీడాకారిణి చక్రిక మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. దీంతో ఆంధ్రా జట్టు సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.


స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. మైసూర్‌లో గురువారం నిర్వహించిన 62వ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో ఏపీ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులు హంజహుస్సేన్, హార్థిక్‌రెడ్డి, సుచీత్‌రెడ్డి కాంస్యపతకాలు సాధించారు. సుచీత్‌రెడ్డి మరో రజత పతకం సాధించారు. విజేతలతో పాటు చీఫ్‌కోచ్ నాగేంద్ర, కోచ్‌లు అనీల్‌కుమార్, హేమంత్‌కుమార్, అఖిల్, నరసింహ, ఆనంద్‌ను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రవిబాబు అభినందించారు.

హెచ్చెల్సీకి నీటి పండుగ



శిథిలావస్థకు చేరిన హెచ్ఎల్ఎంసీ

11పనులకు రూ.36 కోట్లు మంజూరు

కాలువ పటిష్టతకు అడుగులు

సామర్థ్యం పెంపునకు గ్రీన్ సిగ్నల్

ఐదేళ్ల పాటు నిర్లక్ష్యం

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జిల్లాకు తాగు, సాగునీటిని అందించే హెచ్చెల్సీని పూర్తిగా విస్మరించింది. హెచ్చెల్సీ నిర్వహణకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. జలవనరుల శాఖ అధికారులు మూడేళ్లలో ఐదుసార్లు హెచ్చెల్సీ పనుల కోసం ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలు చేశారు. పైగా మంజూరైన పనులను సైతం రద్దు చేశారు. దీంతో హెచ్చెల్సీ నిర్వహణ ఇంజనీర్లకు భారంగా మారింది.

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర ఎగువకాలువ (టీబీపీ హెచ్చెల్సీ)కు పూర్వవైభవం రానుంది. ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన హెచ్చెల్సీ సామర్థ్యాన్ని పెంచుతూ పటిష్ట పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకుగాను ప్రాధాన్యత కింద 11పనులను గుర్తిస్తూ రూ.36 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం 1800 క్యూసెక్కులుగా ఉన్న హెచ్చెల్సీ సామర్థ్యం పనులు పూర్తయితే 2500క్యూసెక్కులకు పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. చాలా చోట్ల బ్రిడ్జిలు, అండర్ టన్నెల్, రెగ్యులేటర్లు కూలిపోయాయి. అటువంటి ప్రాధాన్యత పనులు వచ్చే ఏడాది సీజన్‌లోపు పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే గుర్తించిన 11పనులకు సంబంధించి టెండర్లు వేశారు. జనవరి, ఫిబ్రవరిలలో పనులు ప్రారంభించేందుకు ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు.

11పనులకు రూ.36కోట్లు మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం హెచ్చెల్సీకి అత్యంత ప్రాధాన్యత కింద 11పనులను చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రూ.36కోట్లు నిధులను మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా హెచ్ఎల్ఎంసీ 165.028 కిలోమీటర్ వద్ద సగంలో ఆగిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59కోట్లు కేటాయించారు. 169.400కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91కోట్లు మంజూరు చేశారు. 155.81కిలోమీటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53కోట్లు కేటాయించారు. 115.167కిలోమీటర్ వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66కోట్లు కేటాయించారు. 117.794కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు, 147.395కిలోమీటర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్‌పాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21కోట్లు కేటాయించారు. 137.702కిలో మీటర్ వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21కోట్లు మంజూరు చేశారు. 189.126కిలోమీటర్ వద్ద పీఏబీఆర్ లింకుచానల్ పునర్ నిర్మాణానికి రూ.4.10కోట్లు కేటాయించారు. 189.126 కిలోమీటర్ వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు మంజూరు చేశారు. 115 కిలోమీటర్ నుంచి 130కిలోమీటర్ వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80కోట్లు కేటాయించారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటర్ వద్ద ఆఫ్‌టెక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22లక్షలు కేటాయించారు.



వర్షపు నీటికే పడిన గండి



గడువులోపు పనులు పూర్తి: రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ

గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు నిధులు మంజూరు చేయలేదు. తాజాగా పంపిన ప్రతిపాదనలకు అంగీకారం తెలిపారు. మొత్తం 11పనులకు సంబంధించి రూ.36కోట్లు నిధులు కేటాయించారు. ఏడు నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే టెండర్లను ఆహ్వానించాం. జనవరిలో అగ్రిమెంట్లు పూర్తి చేసి, ఫిబ్రవరిలో పనులు ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది టీబీ డ్యాం నుంచి నీటి విడుదల పూర్తి అయ్యే సమయంలోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచిస్తాం. వచ్చే జూన్, జూలై నెలల్లోపు ప్రభుత్వం సూచించిన పనులను పూర్తి చేసి కాలువ పటిష్టతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.



సీజ్ చేసిన బియ్యంతో అధికారులు

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రెండు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అశోక్‌లైల్యాండ్ వాహనంలో 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకలోని బంగారుపేటకు తరలిస్తుండగా.. పెనుకొండ మండలం గుట్టూరులోని సర్కిల్‌లో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. అలాగే పెనుకొండ సమీపంలోని కియా ప్లాంట్ వద్ద మహేంద్ర గూడ్స్ వాహనంలో తరలిస్తున్న 18 క్వింటాళ్ల బియ్యాన్నీ సీజ్ చేశామన్నారు. వాటిని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఓ వాసుప్రకాష్, పెనుకొండ సీఎస్‌డీటీ ప్రభావతి పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా



మంత్రి పయ్యావుల

ఉరవకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో శనివారం ఉరవకొండలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రూరల్ సీఐ చిన్నగౌస్, ఎస్ఐ జనార్ధననాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాబ్‌మేళాకు ఐదువేల మందికి పైగా నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 68కిపైగా కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయి. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. శుక్రవారం కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశముందని, బయోడేటా, వివరాలను 95022 36524 నెంబర్‌కు వ్యాట్సాప్ చేయాలని సూచించారు.

ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. గురువారం ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తన కార్యాలయంలో మాజీ రిజిస్ట్రార్ శశిధర్‌తో కలిసి వాటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రథమ సమిస్టర్ (ఆర్23) విద్యార్థులకు రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించామని, ఈ పరీక్షలు నిర్వహించిన వారం రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈ లలితకుమారి, విభాగాధిపతులు భారతి, మమత, భువనవిజయ, కళ్యాణ్‌కుమార్, రామశేఖర్‌రెడ్డి, బాలనరసయ్య, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

పంటల బీమాకు మూడు రోజులే గడువు

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో పంటల బీమా వర్తింపునకు ప్రీమియం చెల్లించేందుకు మరో మూడు రోజులే సమయం ఉందని, ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి ప్రీమియం కట్టేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏడీఏలు, ఏఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రబీ ఈ పంట నమోదును పక్కాగా చేసేలా చొరవ చూపాలన్నారు. రెండు రోజుల్లో తుఫాన్ ఉన్నందున ఈ సమయంలో పంట కోతలు కోయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సివిల్‌సప్లై కార్పొరేషన్ ఆధ్వర్యంలో వరి పంట కొనుగోలు ప్రారంభమైందని, వరి పంట విక్రయించేందుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయంపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి, పంటల సాగు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్ నాయక్, బాలూ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

16న రైల్వే పెన్షన్ అదాలత్

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైల్వే జోనల్ పరిధిలోని ఆరు డివిజన్లలో పెన్షన్ అదాలత్‌లను సోమవారం నిర్వహిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఏ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలోని సికింద్రాబాదు, హైదరాబాదు, గుంతకల్లు, విజయవాడ, గుంటూరు, నాందేడ్ డివిజన్లలోనూ, వివిధ వర్క్‌షాప్‌ల్లోనూ ఈ పెన్షన్ అదాలత్‌ను నిర్వహిస్తారన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రైల్వే ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ గెలుపు

గుంతకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు కోసం ఈ నెల 4, 5, 6 తేదీల్లో నిర్వహించిన ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ విజేతగా నిలిచింది. గురువారం స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల్లో మొత్తం 14,359 ఓట్లకుగానూ 12,364 ఓట్లు పోలయ్యాయి. వాటిలో ఎంప్లాయీస్ సంఘ్ 5,966 ఓట్లతో మొదటి స్థానంలో నిలవగా, 5,723 ఓట్లతో మజ్దూర్ యూనియన్ రెండో స్థానంలో నిలిచింది. దీంతో ఎంప్లాయీస్ సంఘ్ 243 ఓట్ల మెజారిటీతో గెలుపు సాధించింది. సంఘ్ నాయకులు కౌంటింగ్ హాల్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ.. రైల్వే ఉద్యోగులు, కార్మికులు తమ సంఘంపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలుపుకుంటామని, కార్మిక పక్ష పోరాటాలను ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. కాగా ఎన్నికల్లో డీఎంఆర్‌కేఎస్ సంఘానికి 372, ఐఆర్ఎంయూకు 132, ఆర్ఎంయూకు 628 ఓట్లు రాగా, 113 ఓట్లు ఇన్‌వ్యాలిడ్‌గా తేలాయి. దక్షిణ మధ్య రైల్వే మొత్తం మీద ఎంప్లాయీస్ సంఘ్ కంటే మజ్దూర్ యూనియన్ అధిక ఓట్లను సాధించింది. జోన్ మొత్తం మీద సంఘ్ కంటే యూనియన్ 3,087 ఓట్ల ఆధిక్యాన్ని సాధించింది.



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ్ నాయకులు

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 12(డిసెంబరు): జిల్లాలోని పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని పెద్ద వడుగూరు, పామిడి పంచాయతీల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించిన లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అదే నిర్లక్ష్యం..!

రెవెన్యూ సదస్సుల్లో కనిపించని చిత్తశుద్ధి



కళ్యాణదుర్గం ప్రాంతంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

అక్కడే సమస్యకు పరిష్కారం.. అంతా తూచ్

గ్రీవెన్స్‌లాగేనే ఫిర్యాదుల స్వీకరణ.. ఆపై మౌనం

రోజువారీ సమాచారం ఇవ్వాలని సర్కారు ఆదేశాలు

అయినా పట్టించుకోని జిల్లా యంత్రాంగం

కలెక్టరేట్‌లో సమన్వయలోపం

అనంతపురం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను త్వరగా పరిష్కరించాలనే ఉద్దేశంతో కూటమి సర్కారు రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈనెల 6న జిల్లాలో రెవెన్యూ సదస్సులను అట్టహాసంగా ప్రారంభించింది. తొలిరోజు 35 రెవెన్యూ గ్రామసభలను నిర్వహించగా.. 456 ఫిర్యాదులు వచ్చాయి. ఇలా జిల్లాలో 34 రోజుల్లో 540 రెవెన్యూ గ్రామాల్లో ఈ సదస్సులను ప్రభుత్వం నిర్వహించింది. అయితే అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో.. వారు సమస్యలపై అదే నిర్లక్ష్యం చూపుతున్నారు.

తొలి రోజున నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 456 ఫిర్యాదులు రాగా.. అందులో కేవలం 18 ఫిర్యాదులను మాత్రమే అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటిపై అదే నిర్లక్ష్యం.

● వైసీపీ అరాచకాలు

వైసీపీ హయాంలో అనేక భూములు, స్థలాలను ఆన్‌లైన్‌లో మార్చడం, నకిలీపాస్ పుస్తకాలు తయారుచేయడం, బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందడం.. తదితర అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో అనేకమంది రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. ఈ సదస్సుల ద్వారా తాము అనేక సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న భూముల సమస్యలు, కష్టాలు తీరుతాయని రైతులు, ప్రజలు ఆశించారు. ఆ సదస్సుల్లో ఫిర్యాదులు చేశారు. అయితే ఆ సమస్యలను పరిష్కరించడానికి అధికారులు పెద్దగా శ్రద్ధ చూపడంలేదు.

● సమాచారం ఏదీ..?

ఈ సదస్సుల్లో వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కార విషయాలను ప్రజలకు తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ వివరాలను పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించింది. ఏగ్రామంలో సదస్సు జరిగితే ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. ఎన్ని పరిష్కరించారో చెప్పాలని.. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టరేట్ నుంచి ప్రతిరోజు రెవెన్యూ సదస్సుల సమాచారం జిల్లాస్థాయి మీడియాకు తెలపాలని ఆదేశించింది. అయితే రెవెన్యూ సదస్సుల సమాచారం ఇవ్వడంలో అధికారులు ఏమాత్రం చిత్తశుద్ధి చూపడంలేదు. కనీసం జిల్లాస్థాయిలో కలెక్టరేట్‌లో కూడా ఈ విషయంలో అధికారుల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సెక్షన్ ఆఫీసర్లకు ఫోన్‌చేస్తే.. తాము చెప్పడానికి లేదని, డీఆర్ఓ ఆ సమాచారం చెబుతారని అంటున్నారు. ఈ డీఆర్ఓ తొలిరోజునే.. అది కూడా పదిసార్లు ఫోన్‌చేస్తే ఆ రోజు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత జరిగే ఏ ఒక్క రెవెన్యూ సదస్సు సమాచారం చెప్పలేదు. కనీసం ఫోన్ కూడా ఎత్తడంలేదు. కలెక్టరు అయినా ఫోన్ చేస్తే.. అడిగినదానికి సమాచారం ఇస్తుంటే... కలెక్టరేట్ అధికారులు మాత్రం కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదు. సమస్యల పరిష్కారం అటుంచి.. కనీసం వాటి సమాచారమైనా ఇవ్వడానికి అధికారులు ఆసక్తి చూపడంలేదు. దీంతో గ్రీవెన్స్‌లాగే ఈ రెవెన్యూ సదస్సు కార్యక్రమం కూడా అబాసుపాలు కాక తప్పదని రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



భారీగా నీరు వృథా



జల్లిపల్లి సమీపంలోని అండర్ చానల్ వద్ద నీటి వృథా



వంకలో వృథాగా పారుతున్న నీరు

శిథిలావస్థలో పీఏబీఆర్ కుడికాలువ

చానల్స్ వద్ద పెద్ద ఎత్తున లీకేజీలు

తగ్గిన నీటి వేగం

చివరి చెరువులకు నీరు చేరేనా..?

కూడేరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ నుంచి నీరు పెద్ద ఎత్తున వృథా అవుతూ వంకల్లోకి వెళ్తోంది. కాలువకు అండర్ చానల్స్ ఉన్న ప్రదేశాల్లో నీరు లీకేజీ అవుతోంది. దీంతో కుడికాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. పీఏబీఆర్ నుంచి కుడికాలువకు గురువారం 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా.. కూడేరు వద్దకు వచ్చే సరికి కాలువలో నాలుగు వందల క్యూసెక్కుల నీరు కూడా ప్రవహించడం లేదు. డ్యాం నుంచి కుడికాలువ నాలుగో కిలోమీటర్ సమీపంలోని అండర్ చానల్ వద్ద పెద్ద ఎత్తున నీరు వంకల పాలవుతోంది. కుడికాలువ 112 కిలోమీటర్లు ఉండగా గురువారం రాత్రికి 98 కిలోమీటర్లకు నీరు చేరే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కూడేరు మండలంలోని వివిధ ప్రదేశాల్లో కాలువలో నీరు వృథా కారణంగా దిగువకు నీరు వేగంగా సాగడం లేదు. ఈ నెల రెండో తేదీన కుడికాలువ నీరు విడుదల చేయగా.. పది రోజులు అవుతున్నా వంద కిలోమీటర్లకు కూడా ఆ నీరు చేరలేదు. కుడికాలువ ద్వారా దాదాపు 49 చెరువులకు నీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 3.266 టీఎంసీల నీరు నిల్వ ఉందని, తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్‌లోకి 500 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

వైసీపీ పాలనలో కుడికాలువకు మరమ్మతులు చేయడానికి పైసా కూడా విడుదల చేయలేదు. అంతేకాకుండా కాలువలో అండర్ చానల్ ఉన్న ప్రాంతాలు దెబ్బతినడంతో నీరు వృథా అవుతోంది. కాలువలో కంపలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటి కారణంగా కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది. ఏటా కాలువకు నీరు విడుదల చేసే సమయంలో కాలువ గట్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించడంతో పాటు కాలువకు మరమ్మతులు చేసేవారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో వీటికి నిధులు విడుదల చేయకపోవడంతో కాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువలో నీటి వేగం పూర్తిగా తగ్గిందని డీసీ డివిజన్ ఈఈ అబ్దుల్ షామీ తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

ఆర్ఎస్ సుదర్శనం (జయంతి)



తెలుగులో పేరెన్నికగన్న విమర్శకులు ఆర్ఎస్ సుదర్శనం 1927 డిసెంబరు 13న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. 1960 నుంచి 90వరకు భారతి, ఆంధ్రప్రభ వీక్లీ వంటి వివిధ పత్రికలకు రాసిన పుస్తక సమీక్షలు సాహితీలోకంలో ఉన్నతస్థాయికి చెందినట్టు గుర్తింపు పొందాయి. ఎందరో రచయితల పుస్తకాలకు ముందుమాట, పీఠికలు రాశారు. ప్రముఖ రచయిత్రి ఆర్ వసుంధరా దేవి ఆయన భార్య. జివి చలం (జీవితచరిత్ర)కు సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. 2001 డిసెంబరు 14న కన్నుమూశారు.

డాక్టర్ డీవీఎస్ రాజు (జయంతి)



ప్రముఖ సినీ నిర్మాత, 'పద్మశ్రీ' గ్రహీత దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు (డీవీఎస్ రాజు) 1928 డిసెంబరు 13న తూర్పుగోదావరి జిల్లా అల్లవరంలో జన్మించారు. డీవీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పలు సినిమాలు రూపొందించారు. నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్‌కు జ్యూరీ సభ్యుడిగా, అధ్యక్షుడిగాను, ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా వ్యవహరించారు. రఘుపతి వెంకయ్య, భీష్మ, నంది పురస్కారాలు పొందారు. 2010లో కన్నుమూశారు.

మనోహర్ పర్రీకర్ (జయంతి)



ఐఐటి చదివిన తొలి ఎమ్మెల్యేగా, తొలి ముఖ్యమంత్రిగా గుర్తింపు పొందారు. 'పద్మభూషణ్' గ్రహీత మనోహర్ గోపాలక్రిష్ణ ప్రభు పర్రీకర్ (పారికర్) 1955 డిసెంబరు 13న గోవాలోని మపుసా ప్రాంతంలో జన్మించారు. బీజేపీలో పేరొందిన రాజకీయనేత. కేంద్ర డిఫెన్స్ మంత్రిగాను, గోవా ముఖ్యమంత్రిగాను వ్యవహరించారు. గోవాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీచే గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2019 మార్చి 17న కన్నుమూశారు.

స్మితా పాటిల్ (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత స్మితా పాటిల్ 1955 అక్టోబరు 17న పూనెలో జన్మించారు. నాటక రంగ కళాకారిణిగాను, సినీనటిగాను పేరొందారు. బుల్లితెరపైనా, వెండితెరపైనా సత్తా చాటుకున్నారు. పదేళ్లలో హిందీ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, కన్నడ భాషలలో 80కుపైగా సినిమాలలో నటించారు. మహిళా హక్కులకోసం పాటుపడ్డారు. 1986 డిసెంబరు 13న కన్నుమూశారు. మరణానంతరం ఆమె నటించిన పదికిపైగా సినిమాలు విడుదల కావడం గమనార్హం.

వెంకటేశ్ (పుట్టినరోజు)



తెలుగు సినీరంగంలో 'విక్టరీ' ఇంటిపేరుగా మార్చుకున్న దగ్గుబాటి వెంకటేశ్ 1960 డిసెంబరు 13న ప్రకాశం జిల్లా కారంచేడు ప్రాంతంలో జన్మించారు. టాలీవుడ్‌లో పేరొందిన నటుడు. 30ఏళ్లకుపైగా ఎన్నో హిట్‌లు అందుకున్నారు. సోదరుడు సురేశ్‌బాబుతో కలసి 'సురేశ్ ప్రొడక్షన్స్' నిర్వహిస్తున్నారు. ఉత్తమ నటుడిగా ఐదు నంది అవార్డులు, ఆరు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌లోనూ చురుగ్గా వ్యవహరించారు.

టేలర్ స్విఫ్ట్ (పుట్టినరోజు)



అమెరికాకు చెందిన గాయని, గేయ రచయిత టేలర్ అలిసన్ స్విఫ్ట్ 1989 డిసెంబరు 13న పెన్సిల్వేనియాలో జన్మించారు. 10 గ్రామీ అవార్డులు, ఒక ఎమ్మీ అవార్డు, 7 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, 32 అమెరికన్ మ్యూజిక్ అవార్డ్స్, 23 బిల్‌బోర్డ్ మ్యూజిక్ అవార్డులు అందుకున్నారు. 2019లో 'ఉమన్ ఆఫ్ ది డికేడ్ ఆఫ్ ది 2010' ఆర్టిస్ట్ ఆఫ్ ది డికేడ్‌గా గుర్తింపు పొందారు.



కాలినడకన వస్తున్న మాలధారులు

హంపికి పోటెత్తిన హనుమాన్ మాలధారులు

కంప్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హనుమాన్ మాల మాలధారులు గురువారం భారీ సంఖ్యలతో తరలివచ్చారు. శుక్రవారం, శనివారం మాలధారణ సందర్భంగా బళ్లారి, విజయనగర, కొప్పాళ, చిత్రదుర్గ, రాయచూరు వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హంపికి తరలివచ్చారు. హంపి విరుపాక్షేశ్వరస్వామిని, యంత్రోత్పాదక ఆంజనేయస్వామిని దర్శించుకుని అక్కడి నుంచి అంజనాద్రి పర్వతానికి చేరుకున్నారు. కొందరు కాలినడకన స్వామివారికి కిష్కింద లోని అంజనాద్రి ఆలయం వరకు వరకు వెళ్లారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

కొత్తచెరువు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ముసలమ్మగారి యశ్వంత్(18) చికిత్స పొందుతూ గురువారం అనంతపురంలోని ఓ ప్రవేటు ఆస్పత్రిలో మృతిచెందినట్లు తల్లి చంద్రకళ తెలిపారు. యువకుడి తండ్రి ప్రసాద్ మూడేళ్లక్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన మృతుని తట్టుకోలేక యశ్వంత్ మానసిక ఆందోళనకు గురవుతూ చదువును కూడా ఆపేశాడు. తీవ్ర మనస్థాపానికి గురై శనివారం మైలసముద్రంలోని అమ్మమ్మ ఇంట్లో పురుగుల మందు తాగాడు. యశ్వంత్ తాను పురుగుల మందు తాగినట్టు కడుపు మంటగా ఉందని వాంతులు, విరేచనాలు రావడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. యువకుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సీఎంకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న మహేష్ జోషి, మంత్రి చలువరాయస్వామి



డీసీఎం డీకే శివకుమార్‌కు..

కన్నడ సాహిత్య సమ్మేళనానికి సీఎం, డీసీఎంకు ఆహ్వానం

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనంలో భాగస్వాములు కావాలని సీఎం సిద్దరామయ్యను ఆహ్వానించారు. మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చలువరాయస్వామి, కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు నాడోజ మహేష్ జోషిలు ఆహ్వానించారు. గురువారం బెళగావి సువర్ణసౌధలో ముఖ్యమంత్రిని సాహిత్య పరిషత్ ముఖ్యులు కలిశారు. ఇదేసందర్భంలో సాహిత్య సమ్మేళనంకు సంబంధించిన ఏర్పాట్లు తదితర అంశాలపై సీఎంకు మహేష్ జోషి వివరించారు. అక్షర జాతరను విజయవంతం చేయాలని సాహితీవేత్తలందరినీ భాగస్వాములను చేయాలని సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. అనంతరం డీసీఎం డీకే శివకుమార్‌ను కలిసిన బృందం ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఈనెల 20 నుంచి జరిగే సాహిత్య సమ్మేళనంలో భాగస్వాములు కావాలంటూ కోరుతూ ఆహ్వాన పత్రికలను అందించారు. ఎమ్మెల్యేలు నరేంద్రస్వామి, ఉదయ్ కదలూరు, రవిగణిగ, రమేష్ బండి సిద్దేగౌడ, ఎమ్మెల్సీ మధుమాదేగౌడలు ఉన్నారు. సువర్ణసౌధలో స్పీకర్ యూటీ ఖాదర్‌తో పాటు మంత్రులను కలిసి ఆహ్వానపత్రికలు అందించారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు కన్నడ కండువాలతో సత్కరించిన మేరకు శాసనసభతో పాటు విధానపరిషత్‌లోను స్పీకర్ సహా మంత్రులు, సభ్యులు కన్నడ కండువాలతో ప్రత్యేకంగా కనిపించారు.

టెకీ సుభాష్‌కు కొవ్వొత్తులతో నివాళి

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భార్య వేధింపులు భరించలేక 40 పేజీల డెత్‌నోట్ రాసిపెట్టి ఆత్మహత్యకు పాల్పడిన టెకీ అతుల్ సుభాష్‌కు మద్దతుగా బెంగళూరు మారతహళ్ళి ప్రాంతంలో సంఘీభావం తెలిపారు. గురువారం రాత్రి పెద్దసంఖ్యలో టెకీలతోపాటు సేవ్ ఇండియన్ ఫ్యామిలీ ఫౌండేషన్ ముఖ్యులు గౌరిశంకర కృష్ణ సారథ్యంలో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ చేపట్టారు.

ఉత్తరప్రదేశ్‌కు తరలిన కర్ణాటక పోలీసులు

భార్యవేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ సుభాష్ వివాదంలో విచారణ నిమిత్తం బెంగళూరు పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు తరలి వెళ్లారు. మారతహళ్ళి పోలీసుస్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ జ్ఞానదేవ్ నేతృత్వంలోని బృందం ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌కు బయల్దేరారు. అతుల్‌సుభాష్ భార్య నికితా సింఘానియాతో పాటు కుటుంబ సభ్యులను విచారణ చేయనున్నారు. అతుల్ సుభాష్ సోదరుడు బికాస్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు సమగ్ర దర్యాప్తునకు సిద్ధమయ్యారు. తొలుత నికితా సింఘానియాకు నోటీసులు ఇచ్చి విచారణ జరపనున్నారు. దర్యాప్తునకు సహకరించకని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోదలచినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో విచారణ ముగిశాక బీహార్‌లోని అతుల్ సుభాష్ తల్లిదండ్రులతో పాటు బంధువుల నుంచి సమాచారం తీసుకోనున్నారు.



మారతహళ్ళిలో కొవ్వొత్తులతో నిరసన ఇలా...

పురోహితుల సమస్యలను పరిష్కరించాలి

బాగేపల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అసంఘటిత పురోహితుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని అఖిలభారత అసంఘటిత పురోహితుల ఫెడరేషన్ అభిప్రాయపడింది. తాలూకాలోని గడిదంలో గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. అసంఘటిత పురోహితుల సంక్షేమానికి గుర్తింపుకార్డు, ఆర్థిక, సామాజిక భద్రతా పథకాలు కల్పించేలా ప్రభుత్వానికి విన్నవించాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జె శ్రీనివాసమూర్తి అభిప్రాయపడ్డారు. మన హిందూ సంస్కృతి దేవాలయాల సొబగు, ఆరాధన, పూజ, ఉపనయనం, హోమం, యజ్ఞం, యాగం, శ్రాద్ధకర్మ, సీమంతం, పుంసవనం, గర్భాదాన వంటివి మన జీవనంలో భాగంగా ఉన్నాయన్నారు. ఆలయాలలో అర్చకత్వంతోపాటు పౌరోహిత్యం వంటివాటితో ప్రస్తుతం కనీస జీవనం సాగించడం కష్టతరంగా మారిందన్నారు. నైపుణ్యాభివృద్ధి వేదాధ్యయనంకోసం గురుకులాలు, బీమా, గృహరుణాలు వంటివి ప్రభుత్వం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఫెడరేషన్ చిక్కబళ్ళాపుర జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామోహన్ శాస్త్రి, అధ్యక్షుడు సందీప్‌శర్మ, ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఆశాకుమార్, కోశాధికారి సురేశ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఫెడరేషన్ సభ్యులు

ఎస్ఎం కృష్ణ సంపూర్ణ జీవితం గడిపారు

బెంగళూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తిరుగులేని రాజకీయ నాయకుడిగా కొనసాగిన ఎస్ఎం కృష్ణ మృతి దుఃఖం కలిగించలేదని సంతోషమేనని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. శాసనసభలో గురువారం డీసీఎం మాట్లాడుతూ ఎస్ఎం కృష్ణ 92ఏళ్ల సంపూర్ణ జీవనం సాగించారని, ఆయన వైవిధ్య జీవితం, క్రీడలు, రాజకీయాల్లో క్రమశిక్షణ కలిగినవారన్నారు. మనిషి పుట్టుక ఎలాగో మృత్యువు ఒకరోజు తప్పదన్నారు. అయితే ఆయన అంచెలంచెలుగా ఎదిగిన విధానం, వివాదాలకు తావులేని విధానం వంటి ఎన్నో కారణాలతో ఆయన మార్గదర్శకులన్నారు. మాది తండ్రీకొడుకులాంటి సంబంధమన్నారు. ఎస్ఎం కృష్ణ సీఎంగా ఉన్నప్పుడు నటుడు రాజ్‌కుమార్‌ను వీరప్పన్ కిడ్నాప్ చేశారని, అప్పుడు ఆయన చాలా ఒత్తిడికి గురయ్యారన్నారు. ఈ సందర్భంగా నాకు జ్యోతిష్యుడు చెప్పాడని రానున్న రోజుల్లో ఎటువంటి హోదా దక్కుతుందనేది తెలుసని వాటి గురించి మాట్లాడలేమన్నారు. ఈసందర్భంలో ప్రతిపక్షనేత అశోక్ స్పందిస్తూ జనవరిలోగా లాక్కోవాలని చెప్పారా.. అంటూ పరోక్షంగా ముఖ్యమంత్రి పదవిని ప్రస్తావించారు. ఇలాంటి విషయాలు సభలో చర్చించలేమన్నారు. రహస్యంగా మాట్లాడుకుందాం రా అంటూ ఛలోక్తి విసిరారు.

రాష్ట్రంలో తుఫాన్ ఎఫెక్ట్



బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వర్షప్రభావం కొనసాగుతూనే ఉంది. సాధారణంగా డిసెంబరులో వర్షాలు ఉండవు. అయితే ఫెంగల్ తుఫాను ప్రభావంతో బెంగళూరు నగర, గ్రామీణ, మైసూరు, చిక్కబళ్ళాపుర, తుమకూరు, మలెనాడు, దక్షిణ కన్నడ తదితర జిల్లాల్లో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులతోకూడిన వర్షం కురిసింది. కాగా బెంగళూరు నగరంలో వాతావరణం చలిగాలులతో ఆహ్లాదకరంగా కొనసాగింది. రాజాజినగర్, మల్లేశ్వరం, చామరాజపేట, జయనగర్, జాలహళ్ళి, దాసరహళ్ళి తదితర ప్రాంతాలలో ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇళ్లకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. దాదాపు ఎటు చూసినా గొడుగులతో ప్రజలు కనిపించారు.




వానలో వాహనదారులు

గ్రామ బహిష్కరణ

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా లింగరాజపురంలో సిద్దరాజు కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించారు. సిద్దరాజు కూతురు మరో కులానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకుందని గ్రామపెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదే గ్రామంలో గోవిందశెట్టి కుటుంబాన్ని కూడా బహిష్కరించారు. గోవిందశెట్టి గ్రామంలో ఇల్లు నిర్మించినందుకు సామాజిక బహిష్కరణ చేశారు. వీరంతా ఉప్పార కులస్థులు. ఉప్పారశెట్టి కులపెద్దలు వీరిని బహిష్కరించారు. ఎస్పీ, జిల్లా అధికారులకు సమాచారం తెలిసినా స్పందించలేదని ఇరు కుటుంబాల సభ్యులు వాపోయారు.









సో(కే)కులు చూద్దాం రారండి..

బెంగళూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగతో పాటు కొత్తసంవత్సర వేడుకలను పురస్కరించుకుని బెంగళూరులో ఏటా ఏర్పాటు చేసే కేక్ షో సంబరం 50వ వసంతంలోకి అడుగెట్టింది. కేక్‌షోను త్రిపుర వాసిని ప్యాలెస్ మైదానంలో ఏర్పాటు చేశారు. కొత్తసంవత్సర వేడుకల దాకా ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం నుంచి కేక్ షోను తిలకించేందుకు వీలుంటుందన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ బేకింగ్, కేక్ ఆర్ట్స్, బేక్ మార్ట్ సంస్థలు సంయుక్తంగా ప్రదర్శనలను సిద్ధం చేశాయి. 50వ కేక్ షో సందర్భంగా 50 నమూనాలను సిద్ధం చేశారు. 850 కేజీలతో అయోధ్య రామమందిరం, సింహాలు, ఏనుగులు, యువతి రూపాలు అద్భుతంగా తీర్చారు. కేకుల సందర్శనకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.


రైతు సమస్యలపై 16న చలో బెళగావి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బసవరాజ నాయక్

రాయచూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతు ఈ నెల 16వ తేదీన చలో బెళగావి ఆందోళన చేపట్టామని కర్ణాటక రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వై బసవరాజ నాయక్ తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో నిర్వహించిన చలో ఢిల్లీ ఆందోళన మాదరిగానే ఈ సారి తాము శాసనసభ సమావేశాలు నిర్వహిస్తున్న బెళగావికి చలో బెళగావి పేరుతో ఆందోళన తలపెట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కనీస మద్దతు ధరలు పూర్తి అశాస్త్రీయంగా ఉన్నాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫార్సుల ఆధారంగా కనీస మద్దతు ధరల కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. దీంతో పాటు జిల్లాలో తుంగభద్ర, నారాయణపూర్ కుడి కాలువ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామన్నారు. హంజిసి రిజర్వార్ నిర్మాణం ఇతర జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు చేపట్టిన ఈ ఆందోళనలో జిల్లా నుంచి రైతులు పాల్గొనాలని కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు బసవరాజ నాయక్



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.36	1,591.19
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4,478	658
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,971	1,924
నీటి నిల్వ (టీఎంసీలు)	91.68	12.06

లాఠీచార్జిపై పంచమశాలీల నిరసన



తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచమశాలి సమాజ సభ్యులు

కంప్లి, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి) : బెల్గామ్‌లో లింగాయత పంచమ శాలిల నిరసనలో పోలీసులు లాఠీచార్జ్ చేయడం సరికాదని సంఘం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరశైవ లింగాయత్ పంచమశాలి సంఘం సమాజం అధ్యక్షుడు చంద్రశేఖర ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. కంప్లి పట్టణం అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన నిరసనలో ఆయన మాట్లాడుతూ కూడల సంగమ పంచమశాలి జగద్గురు మృత్యుంజయ మహాస్వాములు ఆధ్వర్యంలో లింగాయత్ పంచమ శాలి సముదాయాన్ని 2ఏలో చేర్చాలని బెల్గామ్‌లో నిరసనలు చేపడుతున్న వారిపై ఉన్నపళంగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. పలువురికి గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. గతంలో మంత్రి కొండి మంచన్న లింగాయత్‌లపైన దౌర్జన్యం చేశారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్దరామయ్య కూడా లాఠీ ఛార్జ్ చేపట్టి పంచామశాలి సమాజానికి గుర్తుండిపోయారన్నారు. రిజర్వేషన్ పెంపకంపై అడిగేందుకు వచ్చిన వారిపై ముఖ్యమంత్రి పోలీసులు దాడి చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఏడీజీపీ జితేంద్రను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జగద్గురుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. సమాజ సభ్యులపై పెట్టిన కేసులను వెనక్కు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ శివరాజ్‌కు మనవిపత్రం అందించారు. కార్యక్రమంలో హళ్లళ్లి వీరేష్, శరణప్ప గౌడ, ఓంకారగౌడ, రాజశేఖర్‌గౌడ, రేణుక గౌడ, బీవి గౌడ, మల్లికార్జున, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గాయపడిన యువతి మృతి



మహదేవి(ఫైల్)

రాయచూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాల్గు రోజుల క్రితం నగరంలోని మడ్డిపేటలో వీధి కుక్కల దాడిలో గాయపడి కోమాలోకి వెళ్లిన 20 ఏళ్ల యువతి మమాదేవి గురువారం మృతి చెందింది. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి చికిత్స ఫలవంతం కాకపోవడంతో మృత్యువాతపడింది. 20 ఏళ్ల యువతి కుక్కల దాడిలో గాయపడి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధన చూపరులను కలిచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యులు శవాగారానికి తరలించారు.

వీధి కుక్కలను తరలించాలి: బాలలు, మహిళలు, ప్రజల పై దాడులకు తెగబడుతున్న వీధికుక్కలను నిర్బంధించి దూర ప్రాంతానికి తరలించాలని సర్వోదయ భవన నిర్మాణ కార్మిక సంఘం, ఇతర సంఘాల నాయకులు కోరారు. గురువారం జిల్లాధికారి కార్యాలయంలో వివిధ సంఘాల ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఇటీవల నగరంలోని 23వ వార్డు మడ్డిపేటలో వీధికుక్కలు దాడి చేయగా తలకు బలమైన గాయాలైన యువతి కోమాలోకి వెళ్లి మృత్యువాతపడిన నేపథ్యంలో అధికారులు తక్షణం స్పందించాలన్నారు. కొంతకాలంగా నగరంలో అనేక వార్డులు, కాలనీల్లో వీధి కుక్కల స్వేర విహారం పెరిగిపోయిందని వాటిని కట్టడి చేయాలని పలుసార్లు నగరసభ అధికారులకు విన్నవించినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. 20 ఏళ్ల యువతి మృత్యువాతపడడంతో కుటుంబ సభ్యులు దిక్కుతోచక స్థితిలో శోకసంద్రంలో మునిగిపోయారని వారికి ప్రభుత్వ పరంగా తగిన తోడ్పాటునందించాలన్నారు. కాగా ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు వీధి కుక్కలను దూర ప్రాంతానికి తరలించాలని కోరారు.



వినతిపత్రం అంజేస్తున్న సర్వోదయ సభ్యులు

వీధికుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు: డీసీ నితీశ్

నగరంలో పెరిగి పోతున్న వీధి కుక్కల స్వేర విహారాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపడుతామని జిల్లాధికారి కే నితీశ్ తెలిపారు. గురువారం తనను కలిసిన విలేఖరులతో మాట్లాడిన డీసీ, ఇటీవలే నగరానికి చెందిన యువతి ఒకరు కుక్కల దాడిలో గాయపడి మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ విషయంలో తక్షణం పశుసంవర్ధక శాఖ, నగర సభ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వీధి కుక్కలను నిర్బంధించేందుకు తగిన కార్యాచరణ చేపట్టేలా తగిన ఆదేశాల ఇస్తామన్నారు. గతంలోనే వీధి కుక్కలను నిర్బంధించేందుకు కార్యచరణ చేసినా సత్ఫలితానివ్వలేదన్నారు. తరలించిన కుక్కలు తిరిగి నగరానికి చేరుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్న నేపద్యంలో తగిన చర్యలు చేపడుతామన్నారు.

పరిహారం పెంచాలి

బళ్లారి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన బాలింతల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం సరికాదని, దానిని మరింత పెంచాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరి డిమాండ్ చేశారు. గురువారం ఆమె బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో పలు వార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇంత వరకూ మరణించిన బాలింతల కుటుంబాలకు పరిహారం అందలేదని, తల్లిని కోల్పోయిన పిల్లల పోషణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పిల్లల చదువులు, ఉద్యోగాలకు బాధ్యత కల్పించాలన్నారు. ప్రకటన చేసి కొంత పరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటే సరిపోదని పిల్లల పోషణబాధ్యత ప్రభుత్వం తీసుకునేలా రాతపూర్వకంగా హామీ ఇవ్వాలన్నారు. మృతికి ఫ్లూయిడ్స్ కారణమా.. మందులు కారణమా అన్నది ప్రకటించాలన్నారు. ఇకపై తప్పు జరగకుండా చూడాలని, మందుల కొనుగోళ్లకు పిలిచే టెండర్లలో తక్కువ ధరకు కోట్ చేసిన కంపెనీలకు ఆర్డర్ ఇవ్వరాదన్నారు. నాణ్యత కలిగిన మందులనే కొనాలన్నారు. బళ్లారి ఆసుపత్రిలో బాలింతల మరణం విషయం జాతీయ సమస్యగా పరిగణిస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతాజయంతి



శ్లోకాలను పఠిస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవి విద్యాలయంలో గురువారం గీతాజయంతిని ఘనంగా నిర్వహించారు. మూడు సంవత్సరాల నుంచి పాఠశాలలో గీతా జయంతి నిర్వహిస్తున్నట్లు పాఠశాల ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యదర్శి సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక జాగృతిని, నైతిక విలువలను పెంపొందించడానికి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు

కంప్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పేటే బసవేశ్వర స్వామిని గురువారం మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేట బసవేశ్వరస్వామి నీలమ్మదేవి జోడు రథోత్సవాలు సంబరంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. గ్రామాల్లో, పట్టణాలలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాల వల్లే ప్రశాంతత నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, సీఆర్ హనుమంతు, చెన్నప్ప పాల్గొన్నారు.

ఇళ్లను తొలగించడం సరికాదు



పీడీవో రామాలికి వినతిపత్రం ఇస్తున్న ఏఐడీవైవో పదాధికారులు

కంప్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కురుగోడు పరిధిలోని బాదనట్టి గ్రామంలో రోడ్డు వెడల్పు పేరుతో ఇళ్లను తొలగించరాదంటూ ఏఐకేకేఎంఎస్ గురల్లి రాజా డిమాండ్ చేశారు. గురువారం చేపట్టిన నిరసనలో వారు మాట్లాడుతూ రహదారులకు అనుగుణంగానే గ్రామాల్లో ఇళ్లు నిర్మించుకుంటారు. అధికారులు రోడ్డు వెడల్పు పేరుతో పేదల ఇళ్లను తొలగించడం సరికాదన్నారు. ప్రజలకు సమస్య లేకుండా రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. అధికారులు తీరు మార్చుకోకపోతే కురుగోడు తాలుకాలో ఏఐడీవైవో ఆధ్వర్యంలో నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోవింద, పంపాపతి, గోవిందు, గంటా హనుమంతు, మౌనేష్ ఆచారి, మన్నూరు హనుమక్క, కరియమ్మ, లక్ష్మీ, గంట అంబమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్ ప్రారంభం

బళ్లారి సిటీ,డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని హాకీ స్టేడియంలో గురువారం నుంచి జోనల్ హాకీ పోటీలు ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న టోర్నీని అంతర్ జిల్లాల సబ్ జూనియర్ హాకీ టోర్నీని అనంతవాసుదేవ ఆసుపత్రి వైద్యుడు డా.హరిష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఆరంభ మ్యాచ్‌లో అతిథ్య బళ్లారి జట్టు 16గోల్స్‌తో ప్రత్యర్థి రాయచూర్ జట్టుపై విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో హావేరి, బెల్గాం జట్లు తలపడ్డాయి. ఈసందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగార్జునరెడ్డి, బళ్లారి టీమ్ కోచ్ శ్రీధర్‌బాబు, మేనేజర్ సయ్యద్‌సైపుల్లా, సెక్రటరీ కృష్ణారెడ్డి, షాషావలి తదితరులున్నారు.



హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐయూటీయూసీ నాయకులు

సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

- ఏఐయూటీయూసీ నాయకుల పిలుపు

బళ్లారి సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏఐయూటీయూసీ 22వ అఖిల భారత సమ్మేళనం 15నుంచి 17వరకు భువనేశ్వర్‌లో నిర్వహిస్తామని, దేశంలోని వేలాది మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అమెరికా తదితర దేశాలు కుమ్మక్కుతో ఇజ్రైల్, ఉక్రేన్, లేబనాన్ తదితర దేశాలపై అమానుషంగా దాడి చేసి యుద్ధాలు చేయడం సరికాదన్నారు. వీటికి వ్యతిరేకంగా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో యుద్ధం వల్ల కార్మికుల దయనీయ పరిస్థితి గురించి కూలంకుషంగా చర్చించడం, బలిష్టమైన కార్మికశక్తిని తయారుచేయడంపై చర్చిస్తామన్నారు. ఈసందర్భంగా ఈసందర్భంలో జిల్లాధ్యక్షుడు దేవదాసు, కార్యదర్శి ప్రమోద్. ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ, శాంత, శర్మాస్, సురేశ్ వివిధ యూనియన్ ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం సమ్మేళన పోస్టర్లు విడుదల చేశారు.

ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఆయుర్వేద చికిత్స సెమినార్‌లో వక్తలు



సెమినార్‌లో పాల్గొన్న అతిథులు

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, కుటి ప్రావేశిక రసాయన ఆయుర్వేద చికిత్స ద్వారా మనిషి వయో సమజ ముప్పు, వృద్ధాప్యాన్ని అరికట్టవచ్చని కేరళ రాష్ట్ర పాలక్కాడ్ వైద్య నిపుణులు డాక్టర్ అద్రిజా పేర్కొన్నారు. నగరంలోని తారానాథ ప్రభుత్వ ఆయుర్వే వైద్యకళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఒక రోజు సెమినార్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాయకల్ప చికిత్స ద్వారా యవ్వనం పొందవచ్చన్నారు. దేశ విదేశాల నుంచి ఈచికిత్స పొందడానికి కేరళకు అధిక సంఖ్యలో విచ్చేస్తుంటారన్నారు. సెమినార్‌లో తారానాథ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యకీయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవ దిగ్గావి, బెంగళూరు ఆయుష్ శాఖ రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మూర్తి, విద్యాలయం రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ఆర్. వస్త్రద్, ప్రముఖ రస చికిత్స నిపుణులు డాక్టర్ ఎల్.నాగిరెడ్డి, ఇంజనీర్ సంజీవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పనుల పరిశీలన



వినతిపత్రం అందజేస్తున్న రైల్వే వినియోగదారుల కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నైరుతి రైల్వే శాఖకు చెందిన సీనియర్ అధికారుల బృందం గురువారం హొసపేట రైల్వే స్టేషన్ వద్ద అమృత్ భారత్ యోజన కింద జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. నైరుతి రైల్వే జోన్ సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్‌కే జైన్ తదితరులు బృందంలో ఉన్నారు. అనంతరం హంపిలోని విజయశ్రీ హెరిటేజ్ వద్దకు చేరుకున్న ఎస్‌కే జైన్‌కు జోనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సీనియర్ సభ్యుడు బాబులాల్ జైన్ నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి బెళగావి, హొసపేట, హైదరాబాద్, మణగూరు మధ్య సంచరిస్తున్న విశేష రైలును ఇదే నెల 19 నుంచి రద్దుచేయడం తగదన్నారు. ఉత్తరకర్ణాటక బెళగావి, ధారవాడ గదగ్ , కొప్పళ, విజయనగర్, బళ్లారి జిల్లాల నుంచి ప్రసిద్ధ యాత్రస్థల మంత్రాలయానికి చేరే ఏకైక రైలు ఇదేనన్నారు. భక్తుల సౌకర్యార్థం రైలును తిరిగి నడపాలన్నారు. ఈసందర్భంగా నైరుతి రైల్వే విభాగం వ్యవస్థాపకుడు సంతోష్ హెగడే, ఇతర అధికారులు అశోక్‌జిరే, యమునేశ్, ఉమామహేశ్వర్, ఆంజనేయులు తదితరులున్నారు.

మానవ హక్కుల రక్షణకు పోరాడాలి

సిరుగుప్ప, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల కోసం పోరాటం సాగించాలని అఖిల భారత మానవహక్కుల సంఘం అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. సిరుగుప్ప పట్టణంలో మానవహక్కుల దినోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రి రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అందరికీ సమాఎన హోదా రావాలంటే ప్రతి ఒక్కరు తన హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ప్రశాంత్, మానవ హక్కుల సంఘం పదాధికారులు చంద్రశేఖర్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికే పథకాలు

- ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రోహితాక్ష

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీ క్షేత్ర ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో గ్రామీణ ప్రాంతాల నిరుపేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రోహితాక్ష పేర్కొన్నారు. గురువారం బళ్ళారి తాలూకా మోకా ఫిర్కా పరిధిలోని సిరివార గ్రామంలో ధర్మస్థల గ్రామీణ క్షేమీణ క్షేమాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫించన్లు అందుకుంటున్న నిరుపేద వృద్ధురాలు మారెమ్మకు వాత్సల్య కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధర్మస్థళ క్షేమాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు సతీమణి హేమావతి వి.హెగ్డే ఫించన్లు అందుకుంటున్న నిరుపేదలకు వాత్సల్య కిట్‌ను అందజేయాలని సంకల్పించిన నేపథ్యంలో సిరువార గ్రామంలో నిరుపేద రాలు మారెమ్మకు వాత్సల్య కిట్ అందజేశారు. అందుకు హేమావతి వి. హెగ్డే ఆధ్వర్యంలో బళ్లారి జిల్లాలో నిరుపేద, ఎవరూ ఆసరా లేని 180మంది వృద్ధులను గుర్తించి ప్రతినెలా రూ.1000 ఫించన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ కిట్‌లో చాప,దిండు, దుప్పటి, దుస్తులు, సోపు, ప్లేట్, చెంబు, గ్లాస్, కడవ, బెడ్‌షీట్, టవాల్, పౌష్టిక ఆహారం వాత్సల్య కిట్ కుటుంబ నిర్వహణకు అత్యవసరమైన వస్తువులు ఈ కిట్‌లో ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా బళ్లారి తాలూకా పరిధిలోని 28మంది నిరుపేద వృద్ధులకు నెలనెల వెయ్యి రూపాయలు చొప్పున 28వేల రూపాయలు సంస్థ అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత యోజనాధికారి వెంకటేష్ పటగార్, మోకా విభాగం పరిశీలకులు వీరభద్రగౌడ, మహిళా జ్ఞాన వికాస సమన్వయ అధికారి ఆశా, గ్రామ పంచాయతీ సభ్యులు మల్లమ్మ, యూనియన్ అధ్యక్షులు సిద్ధమ్మ, ఉపాధ్యక్షులు రూపా, గ్రామ ప్రముఖులు సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి కిట్ అందజేస్తున్న సంస్థ డైరెక్టర్ రోహితాక్ష

హోసూరు జోన్

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలి



ప్రసంగిస్తున్న చైర్మన్ మాదేశ్వరన్

హోసూరు డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని ప్రజారోగ్య కమిటీ చైర్మన్ మాదేశ్వరన్ ఆదేశించారు. హోసూరు కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను గుర్తించి జరిమానా విధించాలన్నారు. గోడౌన్లను పర్యవేక్షించి, భారీ మొత్తంలో ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు, హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి ఆహారం పదార్థాలను ఉంచడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయన్నారు. అధికారులు వెంటనే ప్లాస్టిక్ వాడకాన్ని ఆపాలన్నారు. అలాగే వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు ఫిర్యాదు చేయడంతో వాటిని పట్టుకుని రేబిస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. రోడ్లపై స్వాధీనం చేసుకున్న పశువులను సంరక్షించేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆవులను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పండుగ సందర్భంగా కొండపై మరుగుదొడ్ల సౌకర్యం మెరుగుపరచాలన్నారు. పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ అలవాట్లు, వ్యర్థ పదార్థాల నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల వైద్యులు, నర్సులు ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలని చైర్మన్‌ను కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ శ్రీకాంత్ అన్ని పనులు సక్రమంగా చేకూరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, మున్సిపాల్ అధికారి అజిత, కౌన్సిలర్లు లక్ష్మి, మోసిన్‌తాజ్, ఆరుముగం తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీపుల్స్ కమిటీ సభ్యులు

హోసూరు డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కృష్ణగిరి జిల్లాలోని నేషనల్ పీపుల్స్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం హోసూరు బస్తీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. జిల్లా అధ్యక్షుడు జయకుమార్ మాట్లాడుతూ.. తల్లితండ్రులు పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వరాదన్నారు. ఉపాధ్యాయులు చేతుల్లో కర్ర తీసుకుని పిల్లలను సరిదిద్దుతే రేపు వాళ్ల తప్పుదారి పట్టేందుకు వీలుందని అన్నారు. అలాగే ఆడ పిల్లలకు బాల్య వివాహాల నిర్మూలన, వరకట్నం వేధింపులు, పాఠశాల విద్యార్థుల డ్రగ్స్ అలవాట్లు చట్టరీత్యా నేరమన్నారు. దీనిని గమనించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలను గమనించి సరైన మార్గంలో తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్ల ట్రేడ్ టీమ్ కార్యదర్శి సంపంగారామ, జిల్లా ఆర్గనైజర్ సూడప్ప, మైనార్టీ కార్యదర్శి ఆజంబాషా, క్రీడా విభాగం జిల్లా కార్యదర్శి డాక్టర్ నాగరాజు, నగర కార్యదర్శి దౌలత్ ఖాన్, నగర ఆర్గనైజర్ శివకుమార్, పెరియస్వామి పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షాలు



జోరుగా కురుస్తున్న వర్షం

హోసూరు డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు పడి నీరు నిలిచి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. బాగలూరు రోడ్డు, కృష్ణగిరి రోడ్డు, బండాంజనేయస్వామి ఆలయం రోడ్లలో మురుగునీరు నిలిచిపోయాయి. హోసూరు నగరంలోని బాగలూరు రోడ్డు గుంతల మయంగా మారింది. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పుట్టినరోజు



అన్నదానం చేస్తున్న మేయర్ సత్య, జిల్లా కార్యదర్శి ప్రకాశ్

హోసూరు డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డీఎంకే రాష్ట్ర యువజన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ జన్మదిన వేడుకలను మున్సిపల్ వలంటీర్ బృందం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పశ్చిమ జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్ పాల్గొని తాలూకా కార్యాలయం రోడ్డులో జెండాను ఎగురవేసి మిఠాయిలు పంపిణీ చేశారు, మేయర్ సత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కౌన్సిల్ చైర్మన్ యువరాజ్, ముఖ్య కార్యవర్గ సభ్యులు ఎల్లోరమణి, కోశాధికారి సుకుమారన్, నగర పాలకులు సెంథిల్ కుమార్, చెన్నీరప్ప, త్యాగరాజు, దినేశ్, అళగరసన్, ఏరియా కార్యదర్శులు ఆనందయ్య, రాము, తిమ్మరాజు, కౌన్సిలర్ నిస్సార్, జిల్లా యూత్ ఆర్గనైజర్ సుమన్, నగర యువజన కలైసెల్వన్, నాగరాజ్, కళా సాహిత్య వివేచన మండలి అధ్యక్షుడు పొన్రామ్ సత్య మైనార్టీ డివిజన్ సిటీ ఆర్గనైజర్ నస్రుద్దిన్, వార్డు కార్యదర్శులు జాన్, సూరి, కుమార్, రఘు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.